క్లుప్తంగా

దేవరకొండపై విశేష పూజలు



దేవరకొండపై స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం దేవర కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించి స్థానిక కళ్యాణ మండపంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపైన కొలాటాలు, చెక్క భజనలు, భక్తి పాటల మధ్య స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాస్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మహిళల ఆర్థికాభివృద్ధికి చేతివృత్తులు చక్కటి మార్గమని, చేతివృత్తులలో నైపుణ్యం సాధించాలని రాస్ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాస్, జన్‌శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో కొర్లగుంటలోని మహిళలకు ఉచితంగా నిర్వహించిన టైలరింగ్ శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. టైలరింగ్ శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ జన్ శిక్షణ్ సంస్థాన్ అందించే వివిధ రకాల చేతి వృత్తుల శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జన్ శిక్షణ్ సంస్థాన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు కుట్టుమిషన్లను రుణాల రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో రాస్ సిబ్బంది రామాంజనేయులు, సీతామహాలక్ష్మి, జయమ్మ, 40 మంది మహిళలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మరింత బలోపేతం



నారావారిపల్లిలో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి: ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రాయలసీమ జోన్ ఆర్‌పీసీ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని నారావారిపల్లి గ్రామంలో డీపీఎం షణ్ముగంతో కలసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు, మహిళా సంఘాలతో వారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిశీలించి, అభినందించారు. ఎన్‌పీఎం దుకాణాల విస్తరణ కోసం మహిళా సంఘాలకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ రేవంత్ రెడ్డి, భానుమూర్తి, ఏడీడీ డీపీఎం పట్టాభి రెడ్డి, చిత్తూరు డీపీఎం వాసు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చిరుధాన్యాల ఉత్పత్తుల మేళా



చిరుధాన్యాల ఉత్పత్తుల మేళాను సందర్శిస్తున్న ప్రజలు

తిరుపతి కల్చరల్: రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, నాబార్డు సహకారంతో రాస్ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఉత్పత్తుల మేళా శనివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ రకాల చిరుధాన్యాలు, చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారం, తిరుబండారాల, కూరగాయలు, ఆకుకూరలు, నేరేడు, పచ్చళ్లు, జనపనార బ్యాగులు, పప్పు ధాన్యాలు, మట్టి కుండలు, పాత్రలు, మామిడి, జామ వంటి విక్రయాలు సాగాయన్నారు. మూడు రోజులపాటు సాగిన మేళాలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులు, మహిళలకు చిరుధాన్యాల సాగులో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.



ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు

పచ్చని అందాలు

తిరునగరిలో రోడ్ల పక్కన పచ్చని చెట్ల అందాలు పరవశింపజేస్తున్నాయి. ఎత్తైన పచ్చని చెట్ల నీడన పాదచారులు, వాహనదారులు ఆహ్లాదభరితంగా సాగుతున్నారు. నగరంలో ఇతర ప్రాంతాలకన్నా యూనివర్సిటీల పరిసరాల్లో ఉష్ణోగ్రతలు కూడా తక్కువగా ఉంటున్నాయంటే ఈ పచ్చదనమే కారణం. ప్రకృతి ప్రేమికులు ఇలా చెట్ల కింద నడుస్తూ చల్లదనాన్ని ఆస్వాదిస్తున్న దృశ్యాలను సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





ఎస్వీ యూనివర్శిటీ వద్ద పచ్చని చెట్లు



శ్రీపద్మావతి యూనివర్శిటీ వద్ద పచ్చని చెట్లు

టీటీడీ విద్యాసంస్థల్లో స్థానిక రిజర్వేషన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న స్టూడెంట్స్ జేఏసీ అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్

తిరుపతి కల్చరల్: టీటీడీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హేమాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. తిరుపతిలోని టీటీడీ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఒక కోర్సుకు ఉండే 80 సీట్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు 5 నుంచి 6 సీట్లు మాత్రమే లభిస్తున్నాయని తెలిపారు. అధికారులు తక్షణం స్పందించి ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థులకు 50 శాతం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే టీటీడీ ఏడీ బిల్డింగ్‌ను సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. మాదిగ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు టి.సుధాకర్, భారతీయ దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేడీ ప్రసాద్, వైఎస్ఆర్ సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం నేత ప్రేమ్‌కుమార్, భారతీయ దళిత విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్, బీడీవైఎస్ కార్యదర్శి ఎ.సుకుమార్ పాల్గొన్నారు.

ఆఖరి స్నేహితుడు పుస్తకావిష్కరణ



ఆఖరి స్నేహితుడు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

తిరుపతి కల్చరల్: జీవితంలోని కఠిన వాస్తవాలను విప్పి చెప్పిన కథలు ఆఖరి స్నేహితుడు కథల పుస్తకమని సంస్కృత విద్యాపీఠం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య ఎ.గురుమూర్తి తెలిపారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో రచయిత తిరువాయపాటి రాజగోపాల్ రచించిన ఆఖరి స్నేహితుడు కథల పుస్తకావిష్కరణ సభ శనివారం సాయంత్రం ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఆఖరి స్నేహితుడు కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎస్వీయూ ఓరియంటల్ స్టడీస్ సంచాలకుడు పీసీ వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేశారు. జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కథా రచయిత మధురాంతకం నరేంద్ర, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ పూర్వ కార్యదర్శి ఆచార్య పి.దేవసేనానాయుడు, సాహితీ వేత్త సాకం నాగరాజు, కాంతారావు, కొత్వాయి అమరేంద్ర, డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ పొక్కశ్ల సుభద్ర, టెంకాలయ దామోదరం, విజయరాంప్రసాద్, రమణ, సోము ఉమాపతి, సుందరం, జయపాల్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ యావ





తిరుపతి నగర ప్రధాన రోడ్లపై సెల్ ఫోన్ చూస్తూ రోడ్డు దాటుతున్న ప్రజలు

సెల్‌ఫోన్.. ఇప్పటి నిత్యావసర వస్తువు. నడుస్తున్నా, తింటున్నా, పడుకున్నా... ఇలా ఏం చేస్తున్నా సెల్‌ఫోన్ ఉండాల్సిందే. అయితే ట్రాఫిక్‌లో, రోడ్డు దాటే సమయాల్లో కూడా చాలామంది సెల్‌ఫోన్ వదలడం లేదు. ఫోన్ చూస్తూనే రోడ్లు దాటడం చేస్తూ ప్రమాదాల పాలవుతున్నారు. కాస్త సెల్‌ఫోన్ యావ తగ్గించుకుంటే ఇబ్బందులకు గురికాకుండా ఉండొచ్చు. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





వాహనాల రద్దీ ఉండే మార్గాలలో సెల్‌ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటుతున్న ప్రజలు

నీట్ స్కాంపై ప్రధాని స్పందించాలి



దండిమార్చ్ వద్ద నిరసన

తిరుపతి సిటీ: నీట్ స్కాంపై ప్రధాని మోదీ మౌనం వీడి స్పందించాలని ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్ఈసీ) కమిటీ రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్ ఎ.హరీష్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఎమ్మార్‌పల్లి దండి మార్చ్ సర్కిల్‌లో నీట్ పరీక్ష రాసిన విద్యార్థులు, తల్లిదండ్రులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ 24లక్షల మంది విద్యార్థులకు నష్టం వాటిల్లుతున్న సమయంలో మన్‌కీ బాత్ నిర్వహించి న్యాయం చేయాలని కోరారు. బీజేపీ పాలనలో ఇప్పటి వరకు 43 పోటీ పరీక్షలకు సంబంధించిన పేపర్లు లీక్ అయ్యాయని మండిపడ్డారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వెంటనే రద్దు చేసి నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలని కోరారు. నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పౌర చైతన్య వేదిక కార్యదర్శి జి.ప్రతాప్ సింగ్, లక్ష్మీ, అమీనా, నవీన్, ఉన్నతి పాల్గొన్నారు.

ఘనంగా ఒలింపిక్ డే ప్రదర్శన



జెండా ఊపి ఒలింపిక్ ప్రదర్శన ర్యాలీ ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: ఒలింపిక్ డే సందర్భంగా తిరుపతిలో క్రీడాకారులతో శనివారం వేడుకగా ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, డీఎస్ఏటీ సయ్యద్ సాహెబ్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎలమంచిలి ప్రవీణ్ పాల్గొన్నారు. జెండా ఊపి ఒలింపిక్ డే ప్రదర్శనను ప్రారంభించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్ నుంచి క్రీడా జ్యోతితో వందలాదిమంది క్రీడాకారులు, క్రీడాభిమానులు, క్రీడా సంఘాల నేతలు ర్యాలీ చేపట్టారు. బాలాజీ కాలనీ నుంచి టౌన్ క్లబ్, క్యాంపస్ స్కూల్ మీదుగా తిరిగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వరకు క్రీడాకారుల ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీధర్, హెచ్.సాయికుమార్, ఎంవీఎస్.మణి, శివప్రసాద్, ప్రసన్నకుమార్‌రెడ్డి, ఏ.ఈశ్వర్ ప్రకాష్, పీఈటీలు విజయకుమారి, సుధారాణి, జెన్ స్పోర్ట్స్ కిరణ్‌కుమార్, రెడ్డెప్ప, కైలాష్, షణ్ముగం, రాజనరసింహ, గజేంద్ర, మురళి, సురేష్, మాలిని, హిందూజ, శశి, క్రీడాకారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ శివారెడ్డి మృతి

తిరుపతి క్రైమ్: ఎన్జీవోస్ కాలనీలో హత్యాయత్నానికి గురైన శివారెడ్డి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అలిపిరి పోలీసుల కథనం.. గత నెల 25వ తేదీ వైఎస్సార్ సీపీ నాయకుడు శివారెడ్డి ఇంటి ఎదురుగా నివాసముంటున్న గిరీష్ చంద్రారెడ్డి, ఆయన భార్య శ్రీలక్ష్మి(టీటీడీ డిప్యూటీ ఈఈ)తో పాటు మరో ఇద్దరితో కలిసి ఇంట్లో ఉండగా విచక్షణా రహితంగా కత్తితో పొడిచి పారిపోయారు. వారిని పోలీసులు నాలుగు రోజుల్లోనే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రస్తుతం వాళ్లందరూ కూడా రిమాండ్‌లో ఉన్నారు. అయితే శివారెడ్డి బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించనున్నారు.

ద్విచక్ర వాహనం దహనం



చంద్రగిరి: ద్విచక్ర వాహనానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన ఘటన మండల పరిధిలోని పాతశానంబట్ల గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడి వివరాల మేరకు.. పాతశానంబట్లకు చెందిన శంకరయ్య శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పంటించారు. మంటలు గమనించిన బాధితుడు వెంటనే మంటలను అదుపులోకి తీసుకురావడంతో వాహనం పాక్షికంగా దెబ్బతినింది. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల న్యూఢిల్లీ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ సెక్రటరీ లీనానందన్

తిరుమల: తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో న్యూఢిల్లీ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ సెక్రటరీ లీనానందన్, ఏపీ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, తెలంగాణ ఎమ్మెల్యే రామ్మోహన్, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు



తెలంగాణ ఎమ్మెల్యే రామ్మోహన్



తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమ రెడ్డి

భక్తి సంకీర్తనల పరిమళం





నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు, అన్నమయ్య సంకీర్తనలు గానం చేస్తున్న కళాబృందం

తిరుపతి కల్చరల్: మనోవికాస్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సంయుక్త ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో నిర్వహిస్తున్న సప్తగిరి సంగీత సప్తాహం శనివారంతో ఏడో రోజుకు చేరుకుంది. అన్నమాచార్య పద కవితా గుభాళింపు పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు, కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను సుమధురంగా గానం చేశారు. కళాకారులు ఎం.మోహన్, పుంగనూరుకు చెందిన నారాయణ స్వామి, ఆనందరెడ్డి, శంకరయ్య, నెల్లూరుకు చెందిన శివశంకర్, శ్రీకాళహస్తికి చెందిన టి.తేజోవతి తదితర 22 మంది కళాకారులు అన్నమయ్య పద సంకీర్తనలను తమదైన శైలిలో ఆలపించారు. కొందరు నృత్య కళాకారులు అన్నమయ్య సంకీర్తనలకు లయబద్ధంగా నృత్యాభినయం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ కళాకారులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

ఫుడ్ టెక్నాలజీ కెరీర్‌పై అవగాహన



మాట్లాడుతున్న కోకాకోలా బేవరేజెస్ ప్రాజెక్ట్ మేనేజర్ జె.చంగముని

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల అన్వేషణలో సలహాలు, కావాల్సిన నైపుణ్యాభివృద్ధిపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన హిందూస్థాన్ కోకా కోలా బేవరేజెస్‌కు క్యూఎస్ఈ ప్రాజెక్ట్ మేనేజర్ జె.చంగముని హాజరయ్యారు. విద్యార్థులకు కెరీర్‌పై పలు సలహాలు, సూచనలు చేశారు. ఆహార భద్రత, నిర్వహణ, నాణ్యత ఫుడ్ టెక్నాలజీలో ప్రధాన అంశాలని తెలియజేశారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నియమాలు, నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హోమ్ సైన్స్ హెడ్ డాక్టర్ వి.బిందు, ప్రొఫెసర్లు సచివంగ, డాక్టర్ అరుణ, శిరీషా, మాధవి, ఎం నిహారిక, విద్యార్థినులు పాల్గొన్నారు.

సీతమ్మ భూములపై ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న పామిడి సత్యనారాయణ

తిరుపతి కల్చరల్: పంగలూరి సీతమ్మ భూములను నిబంధనలను ఉల్లంఘించి లీజుకు ఇచ్చి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఓ వ్యక్తి చేసిన ఆరోపణలు అవాస్తవమని పంగులూరి సీతమ్మ ఆర్యవైశ్య ధర్మసత్రం, శ్రీకన్యకాపరమేశ్వరి ఆల య కమిటీ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లా డారు. పంగులూరి సీతమ్మ వీలునామా ప్రకారం ధర్మసత్రం ఏర్పాటు చేసి చట్టబద్ధత కూడా చేశామన్నారు. ధర్మసత్రం ఆధ్వర్యంలో ఎంఆర్ పల్లిలో ఉన్న భూములలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తద్వారా ఆదాయ వనరులను పొందాలనే ఉద్దేశంతో ఆర్యవైశ్యులకు పదేళ్లపాటు లీజుకు ఇచ్చి, పలు నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. కొందరు చేసే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని కోరారు. ఈ సమావేశంలో శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ కార్యదర్శి కొండూరి మహేష్, కోశాధికారి శిరీష, రవిచంద్రశేఖర్, కాసా రమేష్, లక్ష్మీనారాయణ, పి.హిమకర్, సుబ్బారావు, తీర్థప్రసాద్, టి.రమేష్, నామా రాజేష్, మిట్టా ప్రదీప్, వెంకట సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు జేసీఐ ఉపకార వేతనాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీఐ అధ్యక్షుడు చైతన్య తేజ్

తిరుపతి కల్చరల్: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు మంజూరు చేయనున్నట్లు జేసీఐ అధ్యక్షుడు చైతన్య తేజ్, పూర్వ అధ్యక్షుడు గుణశేఖర్ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500 చొప్పున స్కాలర్ షిప్‌లు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 29వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9550976027, 7997991101లను సంప్రదించాలని తెలిపారు. జేసీఐ కార్యదర్శి శేషసాయి, ఉపాధ్యక్షులు దొరస్వామిరాజు, రత్నశేఖర్, నామా రాజేష్ పాల్గొన్నారు.

అయోధ్య రామయ్యకు నాట్య నీరాజనం



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రైడ్ ఇండియా కల్చరల్స్, సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మహతి కళాక్షేత్రంలో తలపెట్టిన నృత్యోత్సవం అయోధ్య రాముడికి నాట్య నీరాజనంతో శనివారం అత్యంత వేడుకగా ప్రారంభమైంది. ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమానికి దేశం నలుమూలల నుంచి ప్రముఖ నృత్య కళాకారులు పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అలరింపజేశారు. అనంతరం నృత్య కళాకారులకు అయోధ్య రామ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇండియన్ ప్రైడ్ సెలెబ్రిటీ తదితర ప్రతిష్టాత్మక అవార్డులు, పురస్కారాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. తర్వాత నాట్య గురువులను వారి శిష్యబృందంతో వేద మంత్రోచ్ఛారణ నడుమ గురు పూజోత్సవం నిర్వహించారు. సమావేశంలో సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇండియా కల్చరల్స్ సీఈఓ కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ సంప్రదాయ కళలైన శాస్త్రీయ నృత్యకళ, కళాకారుల ఉన్నతికి ప్రైడ్ ఇండియా కల్చరల్స్ కృషి చేయడం అభినందనీయమన్నారు.



నృత్య ప్రదర్శన